# వాడిన మొగ్గ

(1)

టౌన్ సెంటర్ బ్లూలైట్ కాంతుల్లో రాసులు రాసులుగా పోసిఉన్న మల్లెపూల ముందు నిలబడి అమ్మేవాళ్ళ గొంతులు గోలగా వినిపిస్తున్నాయి. విరబూసిన మల్లెవాసనలు టౌన్ నాలుగు మూలలకూ ప్రాకి ప్రాకి మానవు లందరికీ రాత్రి సమీపిస్తూందన్న జ్ఞానం కల్గిస్తున్నాయి.

పగలంతా కాన్పు కేసులుచేసి, చేతులు కడుక్కొని హాస్పిటల్లోనుంచిబైటకువస్తున్న లేడీనర్సు మీదుగా మల్లెపూల గాలులు ప్రాకి ప్రాకి సుళ్ళుతిరిగి హాస్టలు విద్యార్థుల నాసాపుటాల్లోకి ప్రసరించాయ్. గజనీ దండయాత్రలా "ఈ ఒక్కసారి ప్రయత్నించి చూద్దా"మని కెమిస్ట్రీ ఈక్వేషన్లు భట్టీయం వేస్తున్న ప్రౌఢ విద్యార్థికి ఆ గాలులు సోకి మతిచెడిపోయింది.

గవర్నమెంటు ఆఫీసులకూ, మల్లెపూల వాసనలకూ చాలా దూరమే అయినా తమ తప్పులేకుండా పూలవాసనలు కలెక్టర్ ఆఫీసు కుహరాల్లోకి చొచ్చుకుపోయాయి. చిత్ర విచిత్రమైన సంజకాంతులు కరిగిపోయి, బ్లూలైట్ వెలుగుల్లో కలిసి టౌన్ అంతా వెన్నెలలు అలముకొని మల్లెపూల వాసనలు గుమ్మరిస్తున్నా, కలెక్టర్ ఆఫీసు మాత్రం ఫైళ్ళలో స్తంభీభూతమైపోయి ఉన్నది. జడప్రాయమైన ఆ వాతావరణంలో ఇంత చైతన్యం తెచ్చుకొని ఫైలు మూసేసి కోటు తగిలించుకొని, గబగబా బైటకు వచ్చినవాడు ఒక్క సుందరరావే!

కాలేజీ టైమైంతర్వాత కాసేపు పార్కులో కాలం గడిపి, ఇంటికిపోతూ, సుందరరావును కూడా కలుపుకు పోదామని కలెక్టరాఫీసు గేటులో ఆగిన ఫిలాసఫీ లెక్చరర్ శర్మను చూచేసరికి సుందరరావుకు ప్రాణం లేచివచ్చింది.

పూలదండలు చేతులకు తగిలించుకొని మల్లెపూలమ్మే కుఱ్ఱవాళ్లు గోదచేస్తూ శర్మనూ, సుందరరావునూ చుట్టుముట్టారు. సుందరరావుకు, ఇంటిదగ్గర పెద్దబ్బాయి పుట్టిన పండుగ ఆనాడే అని భార్య ఉదయం గుర్తుచేసిన సంగతి జ్ఞప్తికి వచ్చింది. బుట్టనిండా మల్లెపూలు కొనేశాడు.

శర్మ రెండడుగులు నడిచాడు. సుందరరావు శర్మకు ఒక మల్లెపూల పొట్లం అందించాడు. శర్మ అక్కర్లేదంటూ మరి రెండడుగులు నడిచాడు. సుందరరావుకు నవ్వు వచ్చింది.

"నా కిద్దరు మగపిల్లలు, ఇద్దరు ఆడపిల్లలూ; తలమీద ఒకటి రెండు వెంట్రుకలు తెల్లబడ్డట్టు కూడా అనుమానం; అయినా నాకీ పూలమీద మనసు తీరలేదు శర్మా!"

పెదవి కదిలీ కదలకుండా శర్మ చిన్నగా ఒక నవ్వు నవ్వి తన కీయవచ్చిన పూల పొట్లము సుందరరావు బుట్టలో పడవేసి అతని ప్రక్కగా నడవసాగాడు.

"నీ వెంత ఫిలాసఫీ లెక్చరర్ వైనా, కాపుర మేర్పడి నీ కింకా రెండేళ్ళన్నా కాలేదు శర్మా! ఏమో నీ యీ వైరాగ్యం నాకు నచ్చలా!" సుందరరావు నవ్వుతూనే గట్టిగా నవ్వాడు.

పి. అనసూయ

"నీవు మహా రసికుడవు" పెదవిపై ఏమాత్రం హాసరేఖ లేకుండా నెమ్మదిగా పల్కాడు శర్మ.

ఇంతలోకే ఇల్లు రానేవచ్చింది. శర్మ, సుందరరావు ఒకే ఇంట్లో రెండు సమాన భాగాల్లో అద్దె కుంటున్నారు. మధ్యగదులకు, వంటగదులకు మధ్య గోడలున్నాయి కాని వెనక దొడ్డి, ముందు మెట్లూ, దొడ్డీ ఇద్దరూ ఉమ్మడిగా వాడుకొనేవే.

సుందరరావు వీధి తలుపు కొట్టాడు. సుందరరావుగారి చిన్నమ్మాయి, గబగబా వచ్చి తలుపుతీసింది. "నాన్నగారూ, మామయ్యగారు కూడా, ఇవ్వాళ మనింట్లోనే భోజనమట! పెద్దన్నాయి పుట్టిన రోజు పండుగని మామయ్యతో చెప్పమని అమ్మ చెప్పింది."నవ్వుకుంటూ, శర్మ సుందరరావు చిన్నమ్మాయిని బుజాన వేసుకొని లోపలికి వచ్చాడు. "మన యింట్లో ఉండే మామయ్యను ప్రత్యేకంగా పిలవాలా అమ్మా!" అంటూ సుందరరావు లోపల అడుగు పెట్టాడు. లోపల పెద్దబ్బాయి పుట్టినరోజు పండుగ పేరంటం అంతా అయిపోయి, ముత్తైదువల కలకలం అంతా సద్దుమణిగి ప్రశాంతంగా ఉన్నది.

సుందరరావుగారి చిన్నమ్మాయిని బుజాన వేసుకొని శర్మ తానుండే భాగంలోకి వెళ్లాడు. బైట తాళం పెట్టి ఉన్నది. బుజానున్న చిన్నమ్మాయి శర్మముఖంలోకి చూస్తూ చెప్పింది. "ఇవ్వాళ మా యింట్లో భోజనం చేయకుండా తప్పించుకోవాలని చూస్తున్నావా, మీయింట్లో తిందామన్నా అత్తయ్య ఇంట్లో లేదుగా,"

"ఎట్లా వెళ్ళింది తల్లీ" శర్మ మెల్లిగా అడిగాడు.

"మడమకింద ఎత్తుగా ఉండే చెప్పులు తొడుక్కుని డోర్యాల్ డోర్యాల్ గా ఉండే సిల్కుచీర కట్టుకొని, కళ్లజోడు పెట్టుకొని, చేతులో చిన్న సంచి పట్టుకొని టకాటకా నడుస్తూ వెళ్ళిపోయింది మామయ్యా! మా అమ్మ అత్తయ్య దగ్గరకు పోయి "వదినగారూ, అబ్బాయి పుట్టినరోజు పండుగ, పేరంటానికి రం"డని చెప్తున్నా; "షో" టైమైందంటూ చకచకా వెళ్ళిపోయింది. మామయ్యా, సరే కాని "షో" అంటే ఏమిటి మామయ్యా"


శర్మకు ముఖమంతా చెమటలు పోసింది. మెల్లిగా పెదవి కదిలిస్తూ "'షో' తల్లీ, అంటే.... తెరమీద-బొమ్మలాడడం."

శర్మకు అక్కడే నిలవ బుద్ధి పుటలేదు. శర్మకు కాళ్లు కడుక్కోవడానికి నీళ్లు తెచ్చిద్దామని సుందరరావు లోపలికి వెళాడు. సుందరరావు భార్య ఇద్దరికీ భోజనపు ఏర్పాట్లు చేస్తూంది. శర్మ చరచరా బైటకు వచ్చాడు. దగ్గరున్న పార్కుకు వెళ్ళి బెంచీమీద కూలబడ్డాడు. మనస్సు పరిపరి విధాలుగా ఆలోచింప సాగింది.

"శారద బి. ఏ. ప్యాసైన అమ్మాయి. సుందరరావు ఇంటర్ కూడా ప్యాస్ కాలేదు. అయినా సుందరరావంటే శారదకు దైవసమానం;

శారద బ్రతిమాలి పేరంటానికి రమ్మన్నా, పోకపోవడానికి తను శారదకంటె ఎందులో గొప్ప? థర్డ్ ఫారం కూడా ప్యాస్ కాలేదే! తోటి యిల్లాలు పిల్చిందన్న గౌరవంతోనైనా పేరంటానికిపోయి ఉండవచ్చునే!"

పార్కు గేటు మూసేవేళైంది. శర్మ ఇంటికి మెల్లగా నడిచివెళ్లాడు. పుష్పవతి అప్పుడే రిక్షాలో నుంచి దిగి ఏపుల్స్, ద్రాక్ష, టూత్ పేస్టు, హిమాలయాబుకే,



రమ్య

—ఫొటో: బి. రవీంద్రనాథ్.

పోస్తు, ఉన్న బుట్ట లోపలపెట్టమని రిక్షా వాడికి చూపిస్తూ లోపలికి పోయి టార్చి వేసి తాళం తీసి స్విచ్ నొక్కింది.

పార్కు నుంచి కాళ్ళీడ్చుకుంటూ వచ్చిన శర్మ లోపలి మెల్లాలోకి వచ్చి నవారు మంచం వాల్చుకొని పక్క లేకుండానే చేరగిలబడ్డాడు.

కుర్చీలో కూర్చొని, కళ్ళజోడు తీసి, టేబిల్ ఫాన్ స్విచ్ వేసి హైహీల్ షూ విప్పుతూ పుష్పావతి అడిగింది.

"ఏమండీ, పనిమనిషి కారియర్ తెచ్చిందా?"

"తేలేదు"

"అసలిక్కడకు వచ్చిపోయిందా?"

"నేనున్నంత సేపట్లో రాలేదు"

"పోనీ, మీరైనా కబురు చేయకూడదూ?"

"కారియర్ హోటల్ నుంచి నేనే తెద్దామనుకున్నాను. కారియర్ లోపలుందేమో! తలుపు తాళం వేసి ఉన్నది"

"అవును మీరే తెస్తారు; మీ రెందుకు: నేనైనా హోటలుకు పోయి తీసుకు రావచ్చును. ఇక ఆకాస్త లజ్జ మిగిలిఉన్నది" అంటూ పుష్పావతి టేబిల్ మీద ముఖం ఆనించి అట్లాగే పడుండిపోయింది.

శర్మ మంచం మీదనుంచి లేచివచ్చి టేబిల్ అంచుమీద సగం కూర్చొని అన్నాడు. "తప్పులేదు పుష్పా. హోటల్ నుంచీ కారియర్ నీవు తెచ్చినా, నేను తెచ్చినా తప్పులేదు. వంట నీకు అలవాటు లేనప్పుడు నేనైనా వండవచ్చు: మరి నాకు కాలేజీ పనేంది."

"వీలైతే కాలేజీ పనికి సెలవు పెట్టి కూడా ఇంట్లో వంట చేసుకోవచ్చు. కాని మరి నేను బ్రతికి పోయానుగదా!"

పుష్పావతి చెక్కిళ్లమీద కన్నీళ్లు కారడం ప్రారంభించాయి.

"సుఖం అనేది మనస్సు సర్దుకొని తృప్తి పడడంలో ఉంటుంది పుష్పా" ఉంగరమైనా లేని శర్మ పలుచని పొడుగైన వ్రేళ్లు పుష్పావతి చెక్కిలి పుణికి రాల్చి నెకస్ తో మెరిసిపోతున్న ఆమె కంఠం క్రిందుగా జారిపోయాయి.

"మీ ఫిలాసఫీ అర్థం చేసుకునే ఓర్పు నాకు లేదు. నేను మనిషిగా బతకాలి" పుష్పావతి చటున లేచి అవతలకి పోయింది.

శర్మ ఆలోచనలో పడ్డాడు. "నే చెప్పిన ఈ రెండు మాటల్లో నిజంగా ఫిలాసఫీ ఉన్నదా? ఎందుకు లేదు? ఇదీ ఒక ఆలోచనా రీతేగదా? అయినా నే నేమన్నా సోక్రటీస్ నా?.........పుష్పావతి మనిషిగా బ్రతకడానికి నా ఫిలాసఫీ ఒక అభ్యంతరమా? నేను మనిషిలాకనిపించడం లేదూ?"

ఎదురుగా ఉన్న నిలువుటద్దంలో శర్మ ప్రతిబింబం కనిపించింది; కాళ్లమీద జీరాడే మల్లుదోవతి; సైను గుడ్డ లాల్చీ; మెడను చుట్టుకున్న బిళ్లమడత ఉత్తరీయం;

# ★ వాడిన మొగ్గ ★

తైలసంస్కారమైనా లేని మెలిదిరిగిన జుట్టు; పొడుగ్గా ఎఱ్ఱగా ఉన్న ముఖం;

"కాపురానికి వచ్చిన తొలినాళ్లలో పుష్పవతి మనస్సులో చిత్రించుకున్న తన భావిక అలంకరణకూ, తానుఉంటున్న పద్ధతికీ సంబంధంలేదు. ఔను! కాలేజీగ్రూపు ఫోటోలన్నిటిలో అందరూ నిండు సూటులో ముస్తాబై అందాలొలకబోస్తూంటే, పాతపద్ధతి తెలుగు పండితుడులా తన యీ చాదస్తపు వేషం ఏమిటి? ఈ వేషంలో తాను పుష్పవతి ప్రక్కన నిలబడితే తనను ఆవిడ భర్తగా ఎంతమంది పోల్చుకోగలరు?

ఒక్కగా నొక్క కూతురు—గారాబంగా పెరిగిన కలవారింటిబిడ్డ—పుష్పవతికి తనతో కాపురం నిజంగా ఏమీ సుఖంగా లేదేమో! ఇందులో తన తప్పేముంది? పుష్పవతి బంధువులు, ఆవిడ తలితండ్రులు అందరూ పట్టుబట్టి చేసిన వివాహమేగదా? ఇప్పుడీ వైముఖ్యం ఎందుకు?

ఎంతసేపాలోచించినా శర్మ తను చేసిన తప్పేమిటో తెలుసుకోలేకపోయాడు.

ముక్కలు ముక్కలుగా కోసిన ఏపుల్స్, ద్రాక్షపండ్లు ఒక ప్లేటులో పెట్టుకొని పుష్పవతి శర్మ ముందుంచి వెళ్లిపోయింది.

ప్రక్కయింటిలో పిల్లల్ని నలుగురినీ దగ్గర పండుకోబెట్టుకొని కూరుకు తీస్తున్న శారదకు మెలకువవచ్చి భర్తను తట్టిలేపింది.

"అన్నయ్యగారు వచ్చినట్లున్నారు; భోజనానికి పిలుస్తారా?"



తామర, గజ్జి మరియు
దురదలకు
ఆంధ్రదేశానికి ఏజెంట్లు:
ది ట్రేడ్ ప్రమోటింగ్ కార్పొరేషన్.
విజయవాడ - 2. RPC

"ఆమె కూడా వచ్చింది, ఇద్దర్నీ పిలవనా?"

"ఆ, పోదురూ, వస్తే ఆయన్ను పిలవండి"

"అయితే కదలకుండా పడుకో."

"ఈ ఫలహారం అయినా తీసుకుపోండి, ఇంత తిని మంచినీళ్లు త్రాగి పడుకొంటారు, ఆ కాకపోయినా ఈ హోటలు భోజనాలేమిటి?...మన కెందుకు లెండీ!" రెండు పళ్ళాలతో ఫలాహారం పుచ్చుకొని సుందరరావు శర్మగారి గదిలో అడుగుపెట్టాడు.

శర్మకు సిగ్గయింది. మాట్లాడటానికి ఏమీ తోచక "ఇంత ప్రొద్దుపోయి మీరూ మేలుకున్నారా?" అన్నాడు.

సుందరరావు వెనకనే శారద కూడా చంటిపిల్లను బుజాన వేసుకొని నిలుచబడి "వదినెగార్ని కూడా కొంచెం ఫలహారం చేయమని చెప్పండి" అని తిరిగి పోయి పండుకున్నది.

"అట్లాగే తీసుకుంటాములే. పోయి పండుకో సుందరం" అని శర్మ తెచ్చికోలు మర్యాద జరిపాడు. సుందరరావు కూడా వెళ్లి పండుకొన్నాడు.

సుందరరావు శారద దగ్గర నిద్రపోతున్న రెండో పుత్రవాణ్ణి తీసుకొనివచ్చి తనమంచం మీద పండుకొని తాను కూడా కన్నుమూశాడు. కాని సుందరరావుకేమీ నిద్రపట్టలేదు. శర్మ కుటుంబ పరిస్థితి అతనికి ఎంతో ఆందోళన కలిగిస్తూంది.

నిజానికి శర్మ తనకేమీ బంధువుకాడు. బంధుత్వం లేకపోయినా కులంవాడైనా కాడు. ఇంటర్ మీడియేట్ క్లాసులో సహపాఠి. ఏ మంచి సమయంలో మాటలు కలిశాయో, నాటినుంచీ నేటివరకూ పరస్పరం ప్రాణప్రాణంగా ఉంటున్నారు. ఇంటర్ చదివేటప్పటికే తనకు సంసారపు జంజాటన ఏర్పడి కలెక్టరాఫీసుకు జీవితం అంకితం చేయవలసి వచ్చింది. శారద కూడా బి. ఎ. ప్యాసైంది కావడంచేత కాపురానికి వచ్చిన తొలినాళ్లలో హైస్కూల్‌లో టీచరుగా పనిచేసింది కాని సంతు ఏర్పడడంతో ఉద్యోగానికి కాస్తా స్వస్తి చెప్పక తప్పిందికాదు. అట్లాగే ఒక్క రెక్కమీదనే ఇంత సంసారాన్నీ నెట్టుకొస్తున్నాడు. నెట్టుకొస్తున్నాడంటే అదంతా తన తెలివితేటలే కావని కూడా అతనికి తెలుసు. శారద బి. ఎ. ప్యాసైనా అతడు ఇంటర్ తప్పినా, దాంపత్యంలో అమృతం ఒలకపోసి, సంసారాన్ని స్వర్గతుల్యం చేయగల సౌజన్యం ఆమెలో ఉన్నది.

శర్మ స్వభావం సుందరరావుకు తెలిసినంతగా మరెవ్వరికీ తెలియదు. పెండ్లయి రెండేళ్లయినా కాలేదు. ఇంకా ఇంతవరకూ పిల్లా మేకా ఏమీ లేదు. ఆర్జనంటారా, సుందరరావు ఆర్జనకంటే రెండు రెట్లు: కట్నం వద్దని ఆదర్శప్రాయంగా భీష్మించుకున్నాడుగాని "ఊ" అంటే ముప్పై వేలు దూకిపడేవి. ఇప్పటికైనా బావమరిది ఒక్కడే కాబట్టి, మామగారికి తానొక్కడే అల్లుడు కాబట్టి ఎస్టేటులో కొంతైనా ముట్టకపోదు.

"పెద్దగా చదివింది కాకపోయినా అంత ఎస్టేట్‌దారు కూతురుగావడమే ఆమె ఈ విపరీతపు ప్రవర్తనకు కారణం కావచ్చు అయినా ఈ పిచ్చి ఫిలాసఫర్ ముద్దుల పెండ్లాం మోజు తీర్చడానికైనా ఇంత పటాటోపంగా ఉండవచ్చునే. అది చేతకాక, నిరాడంబరంగా ఉండడమే ఆమె వైముఖ్యానికి కారణమా? ఇంత సన్నిహిత మిత్రుణ్ణి గదా, నేనైనా ఒకసారి శర్మతో ఈ విషయం ప్రస్తావించి అతనికి సలహా ఎందుకు ఇవ్వకూడదూ?"

సుందరరావు ఈ ఆలోచనతో రాత్రంతా గడిపాడు.

శర్మ ఉదయానే లేచి ముఖం కడుక్కొకుండానే టేబిల్ మీద ఉన్న పత్రికలన్నీ ఒకటొక్కటే త్రిప్పడం మొదలుపెట్టాడు. 'ఎన్‌కౌంటర్', 'హిబ్బర్ట్ జర్నల్', 'భవన్స్ జర్నల్' అన్నీ పేజీలు త్రిప్పుతున్నాడు. పుష్పవతి ముందు మెల్లాలో నిలబడి టూత్‌బ్రష్‌తో పండ్లు తోముకుంటూ అన్నది:

"ఏమండీ, నాకీ అద్దెకొంపలో ఉండడం ఏమాత్రం ఇష్టం లేదు."

"ఎందుకని పుష్పా!" శర్మ నిదానంగా అడిగాడు.

ఈ మాటలన్నీ ప్రక్కగదిలో కాఫీ కాచుతూన్న శారదకు వినిపిస్తూనే ఉన్నాయి.

"మొదటినుంచీ నేనూ ఇంత గుట్టుగా బ్రతికినదాన్ని. ఏవేళబడితే ఆవేళ అడ్డమైనవాళ్ళంతా వచ్చిపోతూంటే ఈ అలగా కొంపలో నే నుండలేను. ఎట్లాగో ఈ రెండేళ్లు ముక్కుమూసుకున్నాను."

శర్మ శాంతంగా పల్కాడు: "ఏమిటి పుష్పా, నీవనేది? మనింటి కితరులెవరు వస్తున్నారు? సుందరంగారి పిల్లలా? వాళ్ళేగా? ముద్దుగా ముచ్చటగా కాస్త ప్రొద్దుపోతూంది నిజంగా వాళ్లుండబట్టేగా!"

"నే నొకరి పేరెత్తలేదు. అనవసరంగా తగాదాలో కీడ్చకండి. మీ తరహాకు తగినట్లు మీ ముద్దు ముచ్చటలు సాగించుకోండి. కాని నాకు, ఇంత స్థిమితంగా ఏకాంతంగా, కాపురం చేయడానికి మరుగుగా ఉన్న ఇల్లు కావాలి. త్వరగా ఇంకో ఇల్లు చూడండి."

## ★ వాడిన మొగ్గ ★

"ఇళ్లకేం, బస్తీలో చాలా ఇళ్లున్నై. కాని ఇరుగు పొరుగు ఇంత ఆప్యాయంగా జాలితో మనం వేళపట్టున భోజనం చేశామా, చేయలేదా! అని ఆలోచించే సజ్జనులు లభించడం కష్టం."

"ఒకరి జాలితో, దయతో నాకేం పని లేదు"

"మనం కూడా మానవుల మేకదా పుష్పా! కష్టాలు రాకుండా ఉంటాయా?"

"మానవత్వంతో ప్రతికాలంటే అవశ్యం మన మీ యింట్లోనుంచి లేవాలనిపిస్తోంది. కష్టాలంటారూ? ఇంతవరకు ఏమీ లేవు. ఇక మీ నోటిదలువనో, చేతిదలువనో వస్తే రావచ్చు."

"పుష్పా, అనవసరంగా నీవు మనస్సులో చీకాకు పడుతున్నావు."

"నా మనస్సేమీ చెడలేదు; ఈ యిరుగు పొరుగువారి అందచందాలవల్ల మీ మనస్సే చెడ్డది."

ముందింట్లో కూర్చున్న మగనికి కాఫీ యిచ్చి గదిలో తానూ కాఫీ పుచ్చుకుంటున్న శారద మాటలు వినిపించాయి. ఆమె మనస్సు కలుక్కుమంది.

పుష్పావతి అన్న ఈ మాటల్లో ఎదుటనే ఉండి వింటూన్న శర్మ సహనం భగ్నమై పోయింది. పుష్పావతిమీద చేయెత్తాడు. ఆమె కుడిబుగ్గమీద శర్మ ఐదు వ్రేళ్లూ వాతలు తేలాయి.

నిశ్శబ్దంగా ఐదు నిమిషాలు గడిచాయి. పుష్పావతి ఏమీ మాట్లాడలేదు. కళ్లనీళ్లు తుడుచుకుంటూ లోపలికి వెళ్ళిపోయింది. శర్మ ముఖం కడుక్కోకుండానే బైటకు వెళ్ళాడు.

రాత్రి ఏడింటికి శర్మ తిరిగి యింటికి వచ్చాడు. బైట తలుపు తీసే ఉన్నది. లోపలికి వచ్చి చూచాడు. ఎవ్వరూ ఇంట్లో ఉన్న అలికిడే లేదు. తన యింటి గది తలుపు తాళం పెట్టిఉన్నది. సుందరరావుగారింటి వైపు వెళ్ళాడు. వారిల్లుకూడా తాళంపెట్టే ఉన్నది. శర్మకు ఆశ్చర్యం గల్గింది. ఇంటి నాలుగుమూలలూ కలయచూచాడు. ఎవ్వరూ కనిపించలేదు. బైట వాకిటోకి వచ్చాడు. అరుగుమీద ఎవరో పండుకుని ఉన్నారు. మసకచీకటిలో శర్మ "ఎవరునీవు" అని గట్టిగా అరిచాడు. పండుకున్న మనిషి తిరుగ లేచింది.

"బాబూ, నేనా! నేను పనిమనిషిని అండి"

"అమ్మగారేరీ."

"పెట్టే, బెడ్డింగూ, మూటా ముల్లె సర్దుకొని ఇంతకుముందే ప్రయాణమైపోయారు. ఈ తాళంచెవి. మీ కివ్వమన్నారు."

"సుందరరావుగారేరీ?"

"వారింట్లో అందరూ మధ్యాహ్నమే ప్రయాణమై వెళ్లిపోయారు."

"ఎక్కడికి?"

"నాకు తెలియదుబాబూ, వెళ్ళేటప్పుడు అమ్మగారితో శారదమ్మగారేదో మాటాడి పోయారు. అమ్మగారూ ఏదో గట్టిగానే మాట్లాడారుబాబూ. ఇవరంగా నాకు తెలీదు. వస్తా"

పనిమనిషి వెళిపోయింది.

మరునాడు ఉదయం వచ్చి ఇల్లంతా ఊడ్చి కారియర్‌లో భోజనం తెచ్చి అక్కడ పెట్టి వెళ్ళిపోయింది. రాత్రికి భోజనం తేవడానికి మళ్లీ వచ్చింది. శర్మ ఈజీచెర్‌లో పండుకొని మాగన్ను పెట్టి నిద్రపోతున్నాడు. పనిమనిషి కారియర్ తోముదామని మూత ఊడదీసి చూచింది. ఉదయం తెచ్చిన పదార్థాలన్నీ అట్లాగే ఉన్నాయి.

పనిమనిషి శర్మ పండుకున్న కుర్చీ ప్రక్కగా నిలబడి పలికింది.

"బాబూ, అన్నం తిన్నట్టులేరు. మరి ఈపూట కారియర్ ..."

"భోజనం అక్కర్లేదమ్మా"

"పోనీ, లేచి అట్లా ముందు మెల్లాలో కూర్చోండి. ఇల్లంతా ఆగంగా ఉన్నది. చిమ్మిపోతాను"

"పొద్దున చిమ్మిందేగా, ఇదుగో ఇటు చూడూ, ఆ టేబిల్‌లో పర్సు ఇటు తీసుకురా, పాపం, ఈ రెండేళ్లనుంచీ ఎంతో ఒద్దికగా పనిచేశావు."

శర్మ పర్సుతీసి రెండు పదిరూపాయల కాగితాలు పనిమనిషి కిచ్చేశాడు. "ఏమిటిది బాబూ, ఇంత డబ్బెందుకు? నాకు ఇవ్వాల్సింది మొత్తం నాలుగురూపాయలుకూడా ఉండదు. అయితే నాతో పని తీరిపోయిందాబాబూ..." అంటూ పనిమనిషి కళ్లనీళ్లు పెట్టుకుంది.

"పోయిరా అమ్మా, పిల్లలుగలదానివి."

"మా బాబంత మంచివారికి రావల్సిన కష్టాలుగావు" అంటూ పనిమనిషి క్రింద పెదవి పైపళ్లతో నొక్కుకుంటూ పైట చెంగుతో కన్నీళ్లు తుడుచుకుంటూ నమస్కారంచేసి మెల్లగా వెళ్లిపోయింది.

శర్మ ఈజీచైర్‌లోనుంచి లేచి టేబిల్ ముందు కూర్చున్నాడు. శరత్ వ్రాసిన "శ్రీకాంత్" నవల కనిపించింది. పదిపుటలు త్రిప్పాడు. ఆ తర్వాత చదవలేకపోయాడు.

ఆరాత్రి శర్మకసలు నిద్రపట్టలేదు. టేబిల్ ముందు కుర్చీలో కూర్చొని రాత్రంతా ఆలోచిస్తూనే ఉన్నాడు.

మరునాడు మధ్యాహ్నం పోస్టుమాన్ కవరు తెచ్చిచ్చాడు. శర్మ కవరు చించి చూచుకున్నాడు. మామగారు వ్రాసింది. ఉత్తరం ధోరణి అతనికేమీ ఆశ్చర్యం కలిగించలేదు. ఇంకా కొంత కాలం జరిగిన తర్వాత జరుగుతుందనుకొన్నది కొంచెం ముందుగా జరిగింది అంతే! అందుకనే అతనికేమీ ఆశ్చర్యం కలగలేదు.

మరి సుందరరావు, పిల్లాం బిడ్డలు ఏమైనట్లు? అప్పుడే పదిరోజులు గడచిపోయాయి. కనీసం ఇంతకనికరించి "ఫలానా చోట ఉంటున్నాము" అని ఒక ఉత్తరం ముక్క అయినా గీకి పడవేయవచ్చునే! పోనీ ఆఫీసు కెళ్ళి కనుక్కుంటే!...

"ఏదో అర్జంటు పనిమీద ఊరు విడిచి పోయినటు శెలవు పెట్టాడట"

శర్మకు ఆకలి దప్పులు జ్ఞానమే పోయింది. పనిమనిషితో పని లేదు. ఇస్త్రీ చాకలి వాడితో అసలు పనిలేదు. మొదట రెండు రోజులు కాలేజీకి వెళ్ళాడు. ఆ తర్వాత సిక్‌లీవ్ పెట్టేశాడు. నెలాఖరున జీతం తెచ్చుకోవాలని కూడా తోచలేదు.

మరోవారం గడచిపోయింది. ఒక రోజు ఉదయం హఠాత్తుగా ఇంటిముందు గుఱ్ఱబ్బండి వచ్చి ఆగింది. శర్మలేచి వాకిట్లో కెళ్ళి చూద్దామనుకున్నాడు. ఈజీ చెయిరులోనుంచీ లేచిపోవాలంటే సత్తువ లేకుండా ఉంది. గబా గబా ఒక చిన్నమ్మాయి పరుగెత్తుకుంటూ వచ్చి శర్మ పొట్టమీద కూర్చున్నది. అంత చిన్న పిల్ల బరువును సహించే బలంకూడా శర్మ దగ్గర లేదు. కాని ఆ అమ్మాయిని చూడడంతోటే అతనికి ప్రాణం లేచి వచ్చినట్లైంది.

"తల్లీ, నిన్ను మళ్ళా చూస్తాననుకోలేదు. నీకుకూడా నామీద జాలి లేకపోయిందా అమ్మా"

బాగా పెరిగిన శర్మ గడ్డం మీద చిన్నమ్మాయి చిట్టి చేతులు వేసి రాస్తూంటే అతడేదో అనిర్వచనీయానందం అనుభవించడం మొదలెట్టాడు.

ఇంతలోకే ఆగదిలోకి, గోష్పాదమంత పిలకతో ఒక మనిషి హడావిడిగా వచ్చి శర్మ ప్రక్కగా కుర్చీ లాక్కొని కూర్చొని చిన్నమ్మాయిని తన దగరకు తీసుకొని,

"శర్మా, పొరపాటైంది. ఉత్తరం కూడా వ్రాయలేదు" అన్నాడు.

శర్మ సుందరరావు రూపం చూచి విషయం అంతా అవగాహన చేసుకొన్నాడు.

"నాన్నగారు ఆరోగ్యంగా ఉన్నారా?"

సుందరరావు కళ్లనీళ్ళు తుడుచుకుంటూ, "...దాటిపోయి నిన్నటికి పదమూడు. ఆ పల్లె టూళ్లో అమ్మను ఒక్కర్తెను ఉంచడం ఎందుకులే అని వెంట తీసుకొచ్చాను." అన్నాడు.

"పెద్దవాడు. కాలం తీరిపోయింది!—పెద్దతనం అనేమిటిలే—కొంచెం ముందు వెనకగా అందరమూ అక్కడికే" అంటూ శర్మ తల ప్రక్కకు తిప్పుకున్నాడు.

సుందరరావు శర్మను బాగా తేరిపార చూశాడు. కళ్లు గుంటలుపడి, బుగ్గలు లోతుకు పీక్కుపోయి మనిషి పుల్లై—అసలే అల్పంగా ఉండే వాడు—మరీ కుషించిపోయి కన్పిస్తున్నాడు.

సుందరరావు ఇల్లంతా కలయచూశాడు. ఎక్కడి వస్తువు లక్కడే! గచ్చు నేలంతా అరంగుళంమందాన దుమ్ము పేరుకొని, చిందర వందరగా పడిఉన్నది. లోపలి ప్రక్కకు పోయి చూశాడు. పుష్పావతి ఉండదను కుంటూనే చూశాడు. కాబట్టి ఆమె కని పించనందుకు ఆశ్చర్యం కలగలేదు.

'ఈజీచెయిర్'కు అతుక్కుపోయి ఉన్న శర్మముఖంలోకి మరొక్కసారి చూశాడు. "ఏమిటిది శర్మా! నాకైనా హృదయం విప్పి చెప్పవూ?" అంటూ సుందర్రావు అతని చేయి పట్టుకున్నాడు. శర్మ శరీరం భగ్గున మండిపోతూంది.

"చెప్పడానికేముంది సుందరం; లీలగా దానంతట అదే అంతా సెట్టుకుపోతూంది" అంటూ శర్మ బలహీనంగా, ఎండి పగిలిన పెదవులమీదగా పల్చగా తెల్లని నవ్వు జార్చాడు. ఈతనితో వేదాంతం ముచ్చటించడానికిది సమయం కాదని సుందరం ఏకదమ్ము బయటకు వచ్చి, శారదతో "ఇల్లు శుభ్రంచేసి కాస్త పొయిమీద ముందు య్యపుజావ పెట్టు" అంటూ బైటకుపోయి డాక్టర్ను వెంటబెట్టుకొచ్చాడు.

శర్మ వద్దని గట్టి పట్టుబటినా డాక్టరు, సుందరరావు పట్టుదలమీద పరీక్ష చేశాడు.

డాక్టరు బైటకుపోతూ వెంటవస్తున్న సుందరరావును దగ్గరకు పిల్చి చెప్పాడు "పల్స్ చాలా బలహీనంగా ఉంది. హృదయం బహుదుర్బలంగా ఉన్నది. బడ్ ప్రెషర్ అని నా అభిప్రాయం. అయినవాళ్లెవరైనా ఉంటే...ముఖ్యంగా తల్లిగాని, భార్యగాని ఉంటే ఇరవై నాలుగుగంటలూ ఈ మనిషికి పరిచర్య చేయాలి. చేస్తే కొన్నాళ్లకు కొంత గుణం కనపడవచ్చు. ఏమైనా కొంచెం కష్టమే ననిపిస్తూంది."

* * *

శర్మకు తెలియకుండా సుందరం రాయిచ్చిన టెలిగ్రాం చూచుకొని శర్మ మామగారు కుటుంబంగా సొంతకారులో వచ్చేశారు.

పుష్పావతి కారులోనుంచీ అడుగు క్రింద పెడుతూనే ఇంటిలోపలికి చూచింది.

మొటమొదటన్న శారద కన్పించింది. చిన్న బొగ్గులకుంపటి రాజేసి ఆమె నీళ్ళు కాస్తూంది. చంటిపిల్ల గిలగిల ఏడుస్తూన్నది. ఆ పిల్ల సంగతి పట్టించుకున్నవాళ్లెవరూ లేరు. శారదకు ఒక గజం దూరంలో మెత్తగా పక్కపరచిన నవారుమంచంమీద నడుముల వరకూ దుప్పటికప్పుకొని శర్మ వెల్లికిలా పండుకొనిఉన్నాడు. సుందర్రావు పెద్ద కొడుకు శర్మ కాళ్లొత్తుతున్నాడు. సుందర్రావు, వేడినీళ్ళలో గుడ్డతడుపుతూ, శర్మ తలమీద అద్దుతున్నాడు. చిన్నమ్మాయి ఎడమచేత్తో విసనకర్రవిసుర్తూ కుడిచేతో శర్మ బుగ్గలు నిమురుతూ కూర్చుంది. చిన్న కుఱ్ఱవాడు సుందరరావు మీదగావాలి, "నాన్నా, మామయ్య కెప్పుడు నయమవుతుంది" అని అడుగుతున్నాడు.

శర్మ అందర్నీ కలయచూస్తూ, "సుందరం! తరంగాలులేని సముద్రంలాగా నా మనస్సు ప్రశాంతంగా ఉంది. ఇక నే నేమైనా పర్వాలేదు" అంటూ చిన్నమ్మాయి తల వెంట్రుకలలోకి సన్నని తన వ్రేళ్ళు పోనిచ్చాడు.

పుష్పావతి తండ్రి, లోపలికి వస్తూనే, తన వెంట తీసుకొనివచ్చిన డాక్టరుతో అన్నాడు: "దిక్కులేకుండా ఇక్కడ పడుండటమెందుకు? పరిస్థితి ఎట్లా ఉందో చూడండి మన డిస్పెన్సరీకి తీసుకుపోదాం"

సుందరంగాని, శారదగాని ఎవ్వరూ ఏమీ మాట్లాడలేదు.

పుష్పావతి తల్లీ, తమ్ముడు కూడా "ఆలస్యం చేయడం మంచిదికాదు; త్వరగా బయలుదేరండి" అంటూ హడావుడి చేయటం ప్రారంభించారు.

శర్మ కళ్ళుతెరచి అందరివంకా చూశాడు. తల్లిచాటుగా నిలుచబడివున్న పుష్పావతివంక చూచి తల మామూలుగా త్రిప్పుకు పండుకున్నాడు.

మెల్లిగా సుందరరావు శర్మకు విషయం వివరించిచెప్పాడు. శర్మ అక్కడినుంచీ కదలడానికి ఏమాత్రం అంగీకారం సూచించలేదు.


శర్మ మామగారు ఒకటికి రెండుసార్లు చెప్పిచూశాడు. ప్రయోజనం లేకపోయింది. "నాకు లక్షపనులు" అంటూ అందర్నీ అక్కడే వదిలి తానొక్కడు కారులో వెళ్లిపోయాడు.

పుష్పావతి దిగ్భ్రాంతి చెందింది. మగని వంక చూచింది. కల్యాణశిష్టంగా పతి ఉన్నాడు. ఆమెకు తెలియకుండానే కళ్ళ వెంట జొటజొట నీళ్ళుకారాయి. గబగబా అతని మంచం ప్రక్కగా పట్టెమీద తల వాల్చి పులుకు పులుకున ఏడ్వ మొదలెట్టింది. పుష్పావతి ఉంగరాలజుట్టుమీదగా, నున్నని ఫాలంమీదుగా మెత్తని బుగ్గలమీదుగా శర్మ వ్రేళ్లు జారిపోయాయి.

ఫ్యాషన్ పేరుతో చిన్నదిగా పెట్టు కొన్న పుష్పావతి ముఖంమీది తిలకం చెమటకు కరిగిపోయింది కరిగిపోగా మిగతాది కాస్తా శర్మ వేలు రాసుకొని కనిపించ కుండా పోయింది. ★


స్థాపితము: 1920 సంII రం,
సమస్త చర్మవ్యాధులకు,
నెలువు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.
కేటలాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డు)
గోపాలపురం తూర్పు గోదావరి జిల్లా
(వయా) తణుకు.





లల్లూరాం అండ్ కంపెనీ
(స్థాపితము 1928)
ఎన్నో సంవత్సరాలుగా మన్నికకు, నాణ్యతకు, సరసమైన ధరలకు ప్రసిద్ధి చెందిన
* ఇనుప పెట్టెలు * ఉక్కుబీరువాలు
* క్యాషు బాక్సులు
లల్లూరాం అండ్ కో,
వెలగలేటివారి వీధి, :: విజయవాడ - 1.
క్రొత్త షోరూమ్. మారుతి సినిమా ఎదురుగా.